క్లుప్తంగా

136 ఎకరాల్లో వరిపంట మునక

సఖినేటిపల్లి: మండలంలో తుపాను కారణంగా ఆరు గ్రామాల్లో వర్షాలకు 136 ఎకరాల్లో వరిపంట నేలకొరిగి, మునిగిపోయినట్టు ఏవో పీవీ నరసింహారావు గురువారం తెలిపారు. రైతులు 226 ఎకరాల్లో వరి సాగు చేశారన్నారు. తుపానుకు ముందు 40 ఎకరాల్లో వరి పంట కోత, నూర్పులు పూర్తయినట్టు చెప్పారు. మిగిలిన 186 ఎకరాలకు గాను 136 ఎకరాల్లో వరి పంట మునిగినట్టు వెల్లడించారు. దాళ్వా సీజన్‌కు గాను 56 ఎకరాల్లో వేసిన నారు మడులు కూడా నీటమునిగినట్టు తెలిపారు. కాగా మునిగిన వరిపంట కాపాడుకోవడానికి ముంపు నీరు మళ్లించే పనులను ఏవో నరసింహారావు రైతులకు సూచించారు.

క్రీడలకు ప్రాధాన్యం

సఖినేటిపల్లి: క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆడుదాం–ఆంధ్రా స్పోర్ట్స్ కిట్స్ ఎమ్మెల్యే పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు దొండపాటి అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజా, కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, నెడ్ క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, జేసీఎస్ కన్వీనర్ నల్లి మోహన్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

అంబాజీపేట: ఇటీవల కురిసిన భారీ వర్షానికి నష్టపోయిన వరి రైతులను ప్రభుత్వం ఆదుకొని అండగా ఉండాలని టీడీపీ, జనసేన నాయకులు అన్నారు. తహసీల్దార్ టి.మంగతాయారుకు వినతి పత్రాన్ని అందజేశారు.

11న మాదిగల చలో అమలాపురం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

మామిడికుదురు: అమలాపురంలోని కొంకాపల్లి సత్తెమ్మ తల్లి ఆలయం ప్రాంగణంలో ఈ నెల 11వ తేదీన జరిగే హలో మాదిగ, చలో అమలాపురం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. మామిడికుదురులో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రతి ఒక్కరూ కార్యక్రమానికి తరలి రావాలన్నారు.

డ్రైనేజీలలో పూడికతీత

అంబాజీపేట: పంట కాలువల్లోను, డ్రైనేజీల్లో చెత్తా చెదారం, పూడికలు పెరిగిపోవడం వల్ల ఇటీవల కురిసిన భారీ వర్షానికి వరి చేలు నీట మునగడంతో వర్షపు నీటిని బయటకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ కె.సత్యనారాయణ, తహసీల్దార్ టి.మంగతాయారు, వ్యవసాయాధికారి సీహెచ్.డి.విజయ్‌కుమార్ అన్నారు. మొసలపల్లి, ఇసుకపూడిలో ముంపు బారిన పడిన వరిచేలల్లోని నీటిని జేసీబీ సాయంతో బయటకు తరలిస్తున్నారు.

సమష్టిగా కుల గణన

మామిడికుదురు: సుదీర్ఘ కాలం నుంచి ఎదురు చూస్తున్న కుల గణన సర్వే ఎట్టకేలకు సాకారం కావడం ఆనందంగా ఉందని ఎంపీపీ కుసుమ వనజకుమారి పేర్కొన్నారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్వేలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సమిష్టిగా పని చేయాలన్నారు.

అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అవరణలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రావులపాలెంకు చెందిన పి.సత్యనారాయణరెడ్డి రూ.11,158 విరాళం అందించారు.

సత్యసాయి వ్రతాలు

మామిడికుదురు: భగవాన్ శ్రీసత్యసాయిబాబా 98వ జయంతి సందర్భంగా మొగలికుదురులోని జగ్గన్నపేట సత్యసాయి కల్యాణ మంటపంలో గురువారం సామూహిక సత్యసాయి వ్రతాలు జరిగాయి. పలువురు మహిళలు ఈ వ్రతాల్లో పాల్గొన్నారు. 98 సంకీర్తనలు ఆలపించారు. రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం జరిగింది. సత్యసాయి సంస్థల ప్రతినిధి డాక్టర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

'వికసిత'యాత్రపై సదస్సు

అలమూరు: మండలంలోని పెనికేరు గ్రామ సచివాలయం వద్ద వికసిత భారత్ సంకల్ప యాత్రపై గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఎంపీటీసీ సభ్యురాలు యనమదల స్వాతి, ఈఓపీఆర్డీ పిఆర్‌సి.రాజ్‌కుమార్, వైద్యాధికారి పి.భవానీశంకర్, సర్పంచ్ వనుం చిన్నావతి పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కుండ అన్నపూర్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆడుదాం–ఆంధ్రా క్రీడా సామగ్రి గ్రామ సచివాలయ సిబ్బందికి అందజేశారు. ఎంపీటీసీ సభ్యులు చక్రధర కాశీ విశ్వనాథం, చల్లపూడి కుమారి, సర్పంచ్‌లు రామకృష్ణంరాజు, విజయభారతి, శ్యామల, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ చైర్మన్ శ్రీధర్, ఎంపీడీఓ బుజ్జి పాల్గొన్నారు.

నష్టం అంచనాల నమోదుపై దృష్టి

- పలివెల పూజారిపాలెంను వీడని ముంపు
- నిరంతర సహాయక చర్యల్లో అధికారులు



కొత్తపేటలో నీట మునిగిన వరి పంటను కట్టలు కట్టుకునే ప్రయత్నం చేస్తున్న రైతులు



వాడపాలెంలో పడిపోయిన అరటి తోట

కొత్తపేట: మిచాంగ్ పేరుతో విపత్తు సృష్టించి విలయ తాండవం చేసి గడ గడలాడించిన తుపాను వీడి సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. తుపాను నష్టాలు మిగిలాయి. నేలకొరిగిన వరి పంట నీటిలో నానుతూ పంట నష్టం పెరుగుతోంది. పంట చేతికందే దశలో అన్నదాతపై తుపాను రూపంలో ప్రకృతి కన్నెర్ర చేసింది. ఫలితంగా వరుసగా మూడురోజుల పాటు ఈదురు గాలులు, సుడిగాలులతో భారీ వర్షాలు కురిసి పంటను ముంచేశాయి. నియోజకవర్గంలో సుమారు 27 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా సుమారు ఐదు వేల ఎకరాల్లో పంట నేలకొరిగి ముంపునకు గురైంది. డ్రైన్లు నిండుగా పొంగి ప్రవహించడంతో చేలల్లో నీరు దిగక పంట నీటిలో నానుతోంది. దీంతో పంట నష్టం పెరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్తపేట, రావులపాలెం మండలాల్లో సుమారు 4,200 ఎకరాల్లో పంట నష్టం ఉంటుందని అధికారుల ప్రాథమిక అంచనా. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పంట రక్షణకు సూచనలు సలహాలు ఇస్తున్నారు. మరోపక్క పంట నష్టం అంచనాలు తయారు చేస్తున్నారు.

447 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 447 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్టు ఉద్యాన అధికారులు తెలిపారు. 181 ఎకరాల్లో అరటి, 97 ఎకరాల్లో కూరపాదులు, 41 ఎకరాల్లో బొప్పాయి, 128 ఎకరాల్లో పువ్వుల పంట దెబ్బతిన్నట్టు తెలిపారు. పంటల నష్టం నమోదు చేపట్టారు. 20 తాటాకు ఇళ్లు పూర్తిగా, 25 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్టు ప్రాథమిక అంచనా. భారీ వర్షాల కారణంగా కొత్తపేట మండలం పలివెల శివారు పూజారిపాలెం గ్రామం ముంపునకు గురైంది. ఈ గ్రామం పక్కనే గోరింకల డ్రైన్ వెళ్లడం, పూజారిపాలెం గ్రామ పల్లం కావడంతో డ్రైన్ పొంగి ప్రవహించినప్పుడల్లా గ్రామంలో చాలా వరకు ముంపునకు గురౌతోంది. ఈ వర్షాల నీరుతో ముంపు కొనసాగుతుంది.

రైతులు అధైర్య పడవద్దు



తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దానిలో భాగంగా ఇప్పటికే పడిపోయిన వరి పంటను పరిశీలించి ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు పంపాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంట నష్టాల నమోదుకు చర్యలు తీసుకుంటున్నాం. తడిసిన ధాన్యం విషయంలోనూ రైతులు అధైర్యపడాల్సిన పనిలేదు. ఆర్బీకేల ద్వారా కొనుగోలుకు ప్రభుత్వం ఆదేశించింది.

– జి.పద్మలత, ఏఓ, కొత్తపేట

తుపాను బాధిత కుటుంబాలకు సహాయక చర్యలు



తుపాను బాధిత కుటుంబాలకు సహాయక చర్యలు చేపట్టాం. పలివెల శివారు పూజారిపాలెం గ్రామం ముంపునకు గురికావడంతో బుధవారం నుంచీ రెండు పూటలా భోజనం ప్యాకెట్లు సరఫరా చేస్తున్నాం. వానపల్లి, కొత్తపేట గ్రామాల్లో రెండు ఇళ్లు పూర్తిగా, మండలంలో ఎనిమిది ఇళ్లు పాక్షికంగా పడిపోయాయి. బాధితులను ఆదుకోవడంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– జీడీ కిషోర్‌బాబు, తహసీల్దార్, కొత్తపేట

తొలగిన ముంపునీరు

మామిడికుదురు: పాశర్లపూడిలంక–లూటుకుర్రు గ్రామాల మధ్యలో ఉన్న వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌లో తూడు విపరీతంగా పెరిగిపోవడం వల్ల ముంపునీటి మళ్లింపునకు తీవ్ర ప్రతిబంధకం ఏర్పడింది. మామిడికుదురు మండల పరిధిలోని వందల ఎకరాల్లోని ముంపు నీరు దిగేందుకు ఏకైక మార్గమైన ఈ డ్రైన్‌లో పేరుకుపోయిన తూడు తొలగింపునకు గురువారం జెడ్పీటీసీ సభ్యుడు కశిరెడ్డి అంజిబాబు ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. శ్లాబ్ కల్వర్టు వద్ద తూడు విపరీతంగా పెరిగి పోయి ముంపునీరు డ్రైన్‌లోకి దిగకుండా బిగబట్టింది. జేసీబీ సహాయంతో శ్లాబ్ కల్వర్టు వద్ద పెరిగిపోయిన తూడును తొలగించారు. దీంతో ముంపునీరు గోదావరి నదిలోకి పోయింది. దీనిపై రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

జోరుగా ధాన్యం సేకరణ

పి.గన్నవరం: మండలంలో ఇంతవరకూ 3,200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా రైతుల నుంచి సేకరించినట్టు మండల వ్యవసాయ అధికారి కళ్యాణ్‌కుమార్ తెలిపారు. భారీ వర్షాలు తగ్గిన నేపథ్యంలో గురువారం 400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించినట్టు వివరించారు. మండలంలోని కుందాలపల్లి, ముంగండ, బీవీపాలెం, గాజులగుంట గ్రామాల్లో తుపాను వల్ల 10 విద్యుత్ స్తంభాలు, నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు నేలమట్టం అయ్యాయి. ఏఈ ఆనందరాజు ఆధ్వర్యంలో విద్యుత్ పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి.

వేగంగా డ్రైన్లలో పూడిక తొలగింపు

కలెక్టర్ హిమాన్షు శుక్లా



పాశర్లపూడిలంకలో ముంపు సమస్యపై చర్చిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

మామిడికుదురు: జిల్లాలో పంట కాలువలు, మేజర్, మైనర్, రెవెన్యూ డ్రైన్లలో పూడికతో పాటు లాకుల వద్ద పేరుకు పోయిన తూడు, గుర్రపు డెక్కను తొలగించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఆయన గురువారం మామిడికుదురు మండలంలో విస్తృతంగా పర్యటించారు. పాశర్లపూడి లంక–లూటుకుర్రు గ్రామాల సరిహద్దులోని వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌తో పాటు వాడబోది డ్రైన్‌ను పరిశీలించారు. ఆయా డ్రైన్లలో పూడుకు పోయిన గుర్రపు డెక్క, తూడును పరిశీలించారు. ఆదుర్రులో పాడైపోయిన అవుట్ ఫాల్ స్లూయిజ్‌ను పరిశీలించారు. లూటుకుర్రులో రెండు జేసీబీల సహాయంతో పూడికను తొలగిస్తున్నామన్నారు. ముంపు బెడద శాశ్వత నివారణకు డెల్టా ఆధునీకరణ పనులను త్వరలో చేపడతామన్నారు. తద్వారా ముంపు బెడదకు పరిష్కారం కనుగొంటామని చెప్పారు. తుపాను వల్ల కురిసిన భారీ వర్షాలకు రంగు మారినా, తేమ శాతం 17 కన్నా ఎక్కువగా ఉన్నా ప్రభుత్వం ఆ ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఆదుర్రులో శిథిల స్థితికి చేరిన అవుట్ ఫాల్ స్లూయిజ్‌ను పరిశీలించి దాని ఆధునీకరణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు కశిరెడ్డి అంజిబాబు, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు ఉన్నారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ

అధికారులు, సిబ్బందికి ప్రజల ప్రశంసలు



అవిడిలో రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన విద్యుత్ స్తంభం

కొత్తపేట: మిచాంగ్ తుపాను బీభత్సంతో విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురు గాలులతో చెట్లు, కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విరిగి పడ్డాయి. లైన్లు తెగిపోయాయి. ఫలితంగా మూడు రోజుల్లో ఏరోజుకారోజు ఏదో చోట విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఈ తుపాను గాలులకు నియోజకవర్గంలో సుమారు 55 విద్యుత్ స్తంభాలు పడిపోగా, అనేకచోట్ల విద్యుత్‌లైన్లు తెగిపోయాయి. సుమారు 17 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. సుమారు రూ.50 లక్షల నష్టం ఉంటుందని ప్రాథమిక అంచనా. కొత్తపేట మండలంలో ఈ శాఖ ఏఈ పి.నరేష్ ఆధ్వర్యంలో లైన్‌మేన్లు, హెల్పర్లు అప్రమత్తమయ్యారు. ఆదివారం రాత్రి నుంచి బుధవారం వరకూ రాత్రి, పగలు అనే తేడా లేకుండా కత్తిమీద సాములాగా శక్తి వంచన లేకుండా విద్యుత్ పునరుద్ధరణకు కృషి చేశారు. మండలంలో సుమారు 30 విద్యుత్ స్తంభాలు పడిపోగా ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. గ్రామ గ్రామాన వివిధ చెట్లు, చెట్ల కొమ్మలు, కొబ్బరి ఆకులు విరిగిపడి విద్యుత్ లైన్లు తెగిపోగా ఈ సమాచారం అందిన వెంటనే అర్ధరాత్రి అని చూడకుండా, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సంఘటనా స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన యంత్రాలతో విరిగిపడిన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానే కొత్తవి నెలకొల్పి, లైన్లు పునరుద్ధరించి, విద్యుత్ సరఫరా చేశారు. ఈదురు గాలులు వీచినా, ఒక పక్క లైన్లపై చెట్లు పడిపోతున్నా, వైర్లు తెగిపడినా ఎక్కడా ఏవిధమైన ప్రమాదాలు, ప్రాణ నష్టం జరక్కుండా తక్షణ చర్యలు తీసుకున్న విద్యుత్ అధికారులు, సిబ్బందిని ప్రజలు అభినందిస్తున్నారు.

డ్రైన్ల పనితీరు మెరుగు పరచండి



విశ్వేశ్వరాయపురంలో వేప చెట్టు డ్రైన్ మరమ్మతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: రాజోలు దీవిలో ముంపు సమస్య తీవ్రంగా ఉన్నందున అధికారులు డ్రైన్ల పనితీరును మెరుగు పరచాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సూచించారు. మండలంలో విశ్వేశ్వరాయపురం వేపచెట్టు డ్రైన్‌కు జరుగుతున్న మరమ్మతులను గురువారం ఆయన పరిశీలించారు. తుపాను నేపథ్యంలో మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాల వల్ల వ్యవసాయ పొలాలతో పాటు నివాస ప్రాంతాలు ముంపులో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్కడి నుంచే అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వర్షపు నీరు, గుర్రపు డెక్క తొలగింపు చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. తహశీల్దారు జి.వి.ఎల్ నరసింహరావు, ఎంపీడీవో ముత్యం వీరా స్వామినాయుడు, ఏవో ఎస్.రాకేశ్, డ్రైన్స్ డీఈ రాయుడు నాగార్జునరావు, వ్యవసాయ మండలి నాయకులు గుబ్బల రమేష్, నల్లి శివకుమార్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం



వరి కంకులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: తుపాను కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వ పరంగా అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గురువారం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మండలంలోని నేదునూరులో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ మొలకెత్తిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామన్నారు. నేదునూరు గ్రామ సర్పంచ్ గుమ్మడి ప్రసాద్ ఆయన వెంట ఉన్నారు.

అలసత్వం సహించం

మండల సమావేశంలో ఎంపీపీ లక్ష్మివెంకట నాగదేవి



సమావేశంలో మాట్లాతున్న ఎంపీపీ లక్ష్మివెంకట నాగదేవి

రావులపాలెం: గ్రామస్థాయిలో అధికారులు ప్రజా సమస్యలపై అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎంపీపీ కర్రి లక్ష్మివెంకట నాగదేవి స్పష్టం చేశారు. గురువారం రావులపాలెం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అధిక వర్షాలకు పంటలు నష్టపోయిన వారికి, పంట నష్టం ఇప్పించడానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. చేలలో వర్షపు నీరు బయటికి పోయేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. దేవరపల్లి పంచాయతీ పరిధిలో పారిశుధ్య కార్మికులకు స్థానిక అధికారులు, సర్పంచ్ జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో పాలన సాగుతోందని ఎమ్మెల్యే కలుగజేసుకుంటేనే జీతాలు ఇస్తున్నారని అన్నారు. ఇలా పాలన చేయడం వల్ల గ్రామంలో అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎంపీపీ స్పందిస్తూ వారం రోజుల్లో ఈ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌ను ఆదేశించారు. వైస్ ఎంపీపీ గన్నవరపు వెంకట్రావు, తహసీల్దారు బి.మృత్యుంజయరావు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధి జరగాలంటే మళ్లీ జగన్ సీఎం కావాలి



నర్శిపూడిలో సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఆలమూరు: రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి జరగాలంటే సీఎం వైఎస్ జగన్ మళ్లీ రావాలని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు తోరాటి సీతా మహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, వైఎస్సార్‌సీపీ నేత చల్లా వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మండలంలోని నర్శిపూడిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, గృహసారథులు వలంటీర్లతో కలిసి గ్రామంలో పర్యటించారు. గత నాలుగేన్నర కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రజలకు వివరించారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు గ్రామ సచివాలయంలో పల్లె నిద్ర చేశారు. నియోజకవర్గ బూత్ కమిటీ మేనేజర్ నామాల శ్రీనివాసు, సర్పంచ్ కందిబొట్ల శ్రీనివాసు, ఎంపీటీసీ సభ్యుడు మేడిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

అయినవిల్లి: మండలంలో పలు గ్రామాలలో బీజేపీ నేతలు పర్యటించి నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు యాళ్ల దొరబాబు మాట్లాడుతూ పలు గ్రామాల్లో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మునిగిన వరి చేలకు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు అయ్యాజీ వేమా, చీకురుమెల్లి వెంకటేశ్వరరావు ఆయన వెంట ఉన్నారు.

అయినవిల్లి: మిచాంగ్ తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాల వల్ల నీట మునిగి మొలకలు వచ్చి తడిసిపోయిన ధాన్యాన్ని టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గంటి హరీష్ మాధురి బాలయోగి పరిశీలించారు. గురువారం ఆయన అయినవిల్లి, నేదునూరు ,నల్లచెరువు గ్రామాలలో పంటపొలాలను పరిశీలించారు.

కొత్తపేట: జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం వానపల్లి పరిసర ప్రాంతాల్లో పడిపోయిన వరి పంటను పరిశీలించారు.

రాజోలు: తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాజోలు మండల బీజేపీ నాయకులు కోరారు. గురువారం మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా స్వగృహం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు పితాని శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు పరిహారంగా అందించాలన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

అంబాజీపేట: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పిల్లలను పనిలో పెట్టుకుని వారితో పనులు చేయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ విజయ్‌ప్రకాశ్ హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్తపేట, అయినవిల్లి, అంబాజీపేట మండలాల్లోని వివిధ షాపులను గురువారం పరిశీలించారు. ఆయా మండలాల్లో ఉన్న బేకరీలు, హోటల్స్, పెట్రోల్ బంకులు, కన్‌స్ట్రక్షన్ బిల్డింగ్‌లతో పాటు వ్యాపార సంస్థలను తనిఖీ చేశారు. 14 ఏళ్లలోపు పిల్లలను, 15 నుంచి 18 ఏళ్ల లోపు వయసు గల వారిని పనిలోను, ప్రమాదకరమైన పనుల్లో పెట్టుకోవద్దని యజమానులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్పీ ఎస్.వెంకటేష్, పోలీస్ కానిస్టేబుల్ రమణ పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి నిధులు

అంబాజీపేట: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక నిధులు మంజూరు చేస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా, ఉత్తరాంధ్ర జిల్లాల బీజేపీ ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి కొల్లి సూర్యారావు అన్నారు. వికసిత్ భారత సంకల్ప యాత్రలో భాగంగా గురువారం కె.పెదపూడి పంచాయతీ కార్యాలయంలో ఈఓపీఆర్డీ బి.మమత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. సూర్యారావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం అమలు చేస్తున్న అనేక పథకాలను వివరించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు పాల్గొన్నారు.

చెట్లు, కొమ్మల తొలగింపు

అయినవిల్లి: తుపాను కారణంగా పడిన చెట్లను, చెట్ల కొమ్మలను విద్యుత్ శాఖ అధికారులు గురువారం తొలగించారు. మండలంలోని అయినవిల్లి, తొత్తరమూడిలో కొడవటివారిలంకలో గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు చేపట్టారు. విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోలు

కొత్తపేట: తుపాను భారీ వర్షాలకు తడిసి, రంగు మారిన ధాన్యాన్ని కూడా బేషరతుగా కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పర్యటించి పడిపోయిన వరి పంటను, ఆరబెట్టుకుంటున్న ధాన్యాన్ని పరిశీలించారు. గురువారం కొత్తపేట మండలం పలివెల శివారు చౌదరిపురం ప్రాంతంలో ధాన్యం రాసులను చూసి తీవ్రంగా చలించారు. రైతుల కష్టాన్ని తుపాను తీవ్రంగా నష్టపరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. సహాయక చర్యల గురించి అక్కడి నుంచే ఫోన్‌లో వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఏ ఒక్కరూ ఆందోళన పడవద్దని రైతులకు ధైర్యం చెప్పారు. అన్ని విధాలా ఆదుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీల రూపంలో సాధ్యమైనంత వరకూ నష్టాన్ని భర్తీ చేసి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

మొలకెత్తకుండా చర్యలు తీసుకోవాలి

అంబాజీపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నేలకొరిగి నీటి పాలైన వరి పంట మొలకెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త పి.బి.ప్రదీప్, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎ.రాజశేఖర్ అన్నారు. పుల్లేటికుర్రు, గంగలకుర్రు గ్రామాల్లో నీట మునిగిన వరి చేలను ఏఓ సీహెచ్.డి.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి నూర్చిన ధాన్యం కళ్లాలు రెండు మూడు రోజులు ఎండ బెట్టే అవకాశం లేకపోతే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని రైతులకు వివరించారు. తడిసిన ధాన్యం గింజలు మొలకెత్తమే కాకుండా రంగు మారే అవకాశం ఉందని, వీటిని నివారించేందుకు ఒక క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పును, 20 కిలోల పొడి ఊక లేదా 4 కిలోల వరి గడ్డితో గాని కలిపి పొగపెట్టాలన్నారు. దీనివల్ల గింజ మొలకెత్తడం అరికట్టవచ్చన్నారు. సర్పంచ్ జల్లి బాలరాజు, సొసైటీ అధ్యక్షుడు నందుల ఆదినారాయణ, రైతులు పితాని శ్రీనివాసరావు, గంటి సత్యనారాయణ, బట్టు సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజులపాలెం అభివృద్ధికి రూ.27 కోట్లు



రాజులపాలెంలో అభివృద్ధి పనుల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

పి.గన్నవరం: రాజులపాలెం గ్రామంలో అభివృద్ధి పనులు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా జగనన్న ప్రభుత్వం ఇంతవరకూ రూ.27 కోట్ల మేర వెచ్చించిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు తెలిపారు. 'ఏపీకి సీఎం జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో నిర్వహించారు. అభివృద్ధి పథకాల డిజిటల్ బోర్డును, పార్టీ పతాకాన్ని కన్వీనర్ వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, సొసైటీ చైర్మన్ మెల్లం మహాలక్ష్మి ప్రసాద్, పార్టీ నాయకులు గుత్తుల మధు, నక్కా గోపి, జల్లి పండు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల బహూకరణ



విద్యార్థులకు సైకిళ్లు బహూకరిస్తున్న డీఈఓ కమలకుమారి

పి.గన్నవరం: అమలాపురం అంబేడ్కర్ భవన్‌లో గురువారం జిల్లా స్థాయిలో నిర్వహించిన ధీరూబాయి అంబానీ క్విజ్ పోటీల్లో పి.గన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఫైనల్స్‌కు అర్హత సాధించారు. దీంతో వారిద్దరికీ రిలయన్స్ సంస్థ ప్రతినిధులు జిల్లా విద్యాశాఖ అధికారి కమలకుమారి చేతుల మీదుగా సైకిళ్లను బహుమతిగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

సుపరిపాలనకు సచివాలయ వ్యవస్థ

సఖినేటిపల్లి: గ్రామ స్థాయిలో సుపరిపాలన కోసం సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి, వలంటీర్లను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నియమించారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం వీవీమెరక సచివాలయం–2 వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్)కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంక్షేమ పథకాలతో మారిన జీవనం మధ్య తేడాను ప్రజలు ఆలోచించాలని అన్నారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎమ్మెల్యే రాపాక ఆవిష్కరించారు. తొలుత సచివాలయం–2 వద్ద సంక్షేమ పథకాల బోర్డుతో పాటు, మొత్తం సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య, ప్రతి పథకానికి పంపిణీ చేసిన మొత్తాన్ని హైలెట్ చేస్తూ డిస్‌ప్లే బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, ఉపసర్పంచ్ చెంపాటి రామకృష్ణంరాజు, పార్టీ మండల ప్రెసిడెంట్ కుసుమ చంద్రశేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు కారుపర్తి భాస్కరరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి నల్లి మోహన్, ఇంజేటి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.